రాకపోకలకు చింతలేదిక




పార్వతీనగర్, శ్రీకాంత్‌నగర్ మధ్య జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం

- ఆరిలోవలో రెండు వంతెలల నిర్మాణం
- రూ.3 కోట్ల జీవీఎంసీ నిధులతో పనులు
- త్వరలో అందుబాటులోకి బ్రిడ్జిలు

ఆరిలోవ: నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లుగా పలు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు, ఆస్పత్రులు, కాలువలు, రోడ్ల నిర్మాణం, గెడ్డల ఆధునికీకరణ ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో గెడ్లపై వంతెనల నిర్మాణాలు సాగుతున్నాయి. దశాబ్దాలుగా ఇరుకుగా ఉన్న బ్రిడ్జిలు ఇప్పుడు విశాలమవుతున్నాయి. విశాలమైన రోడ్ల మధ్య గెడ్డలపై చిన్న వంతెనలు ఉండడంతో వాహనరాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఈ విషయం తెలుసుకున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనలతో జీవీఎంసీ అధికారులు ఆరిలోవ ప్రాంతంలో అవసరమైన చోట్ల గెడ్డలపై బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టారు. జీవీఎంసీ 11, 12 వార్డుల పరిధిలో ఉన్న పార్వతీనగర్–సూర్యతేజనగర్ మధ్య, పార్వతీనగర్,–శ్రీకాంత్‌నగర్ మధ్య వంతెనల పనులు సాగుతున్నాయి.

రూ.3 కోట్లతో రెండు వంతెనలు

చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద బీఆర్‌టీఎస్ కూడలి నుంచి సూర్యతేజానగర్ వద్ద శ్రీకాంత్‌నగర్ మలుపును కలుపుతూ ఇటీవల రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. గతంలో ఇక్కడ ఇరుకుగా ఉన్న 20 అడుగుల రోడ్డును విస్తరించి 60 అడుగుల నుంచి 80 అడుగుల వెడల్పుతో నిర్మించారు. ఈ రోడ్డుకు మధ్యలో సూర్యతేజానగర్ వద్ద పెద్ద గెడ్డ ఉంది. దీనిపై సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి ఇరుగుగా ఉండడంతో ఇబ్బందిగా మారింది. **ఈ బ్రిడ్జిని పూర్తిగా కూల్చివేసి,** దాని స్థానంలో **సుమారు 50 అడుగుల వెడల్పుతో** కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. దీంతో పాటు ఇదే ప్రాంతంలో పార్వతీనగర్, శ్రీకాంత్‌నగర్ మధ్య మరో చిన్న వంతెన నిర్మాణం కూడా చేపట్టారు. ఇక్కడ నుంచి శ్రీకాంత్‌నగర్ వెళ్లే డబుల్ రోడ్డు మధ్యలో కొన్ని నివాసాలు ఉండేవి. వాటి వల్ల ఇక్కడ రోడ్డు ఇరుకుగా మారింది. వాటిని ఇటీవల తొలగించి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ గెడ్డపై వంతెన నిర్మాణం చేపడుతున్నారు. వీటి కోసం జీవీఎంసీ రూ.3 కోట్ల నిధులు కేటాయించింది. ఈ రెండు వంతెనల నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయినట్లు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఈ వంతెనలు అందుబాటులోకి వస్తే ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, టీఐసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల వాహనచోదకులు చినగదిలి వద్ద బీఆర్‌టీఎస్‌కు సులువుగా చేరుకోవచ్చు.


పార్వతీనగర్, సూర్యతేజనగర్ మధ్య తుది దశకు చేరిన బ్రిడ్జి పనులు

ఏళ్లగా నాటి సమస్యకు మోక్షం



ఆరిలోవ ప్రాంతంలో ఇరుకు బ్రిడ్జిల సమస్య ఎన్నో ఏళ్లగా ఉంది. ఈ నేపథ్యంలో పార్వతీనగర్, సూర్యతేజనగర్ బ్రిడ్జి పనులు జరుగుతుండడం ఆనందంగా ఉంది. ఈ బ్రిడ్జి పనులు పూర్తయితే వాహనాల రాకపోకలకు ఇక ఇబ్బందులు ఉండవు.

– కాళ్ల సూరిబాబు, పార్వతీనగర్

తరచూ ప్రమాదాలతో భయమేసేది..



సూర్యతేజనగర్‌లో గతంలో ఇరుకుగా ఉండే బ్రిడ్జిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ఓ వైపు పార్వతీనగర్ నుంచి, మరో వైపు శ్రీకాంత్‌నగర్ నుంచి వచ్చినప్పుడు వాహనచోదకులు ఇక్కడ మలుపు వద్ద కనిపించక ప్రమాదాల బారిన పడేవారు. ఇప్పుడు రోడ్డు విశాలం కావడం.. కొత్తగా వెడల్పుతో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉంటుంది. ఇక్కడ ఎన్నో ఏళ్లగా ఉన్న సమస్యకు ఇప్పుడు పరిష్కారం లభించడం సంతోషంగా ఉంది.

– అచ్యుతరావు, అంబేడ్కర్‌నగర్

క్లుప్తంగా

బాడీ బిల్డింగ్‌లో ఆరిలోవ యువకుడికి పతకం


పవన్‌ను అభినందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: సౌత్ గోవాలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన ఐపీఎల్ ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆరిలోవ ప్రాంతం శ్రీకాంత్‌నగర్‌కు చెందిన కె.పవన్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం పెదగదిలిలో మేయర్ క్యాంప్ కార్యాలయంలో పవన్‌ను మేయర్ హరివెంకటకుమారి అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

బీచ్ రోడ్డు: రాష్ట్రంలో 10 లక్షల మంది స్వర్ణకార వృత్తిలో ఉన్నారని, వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ నాలుగు సీట్లు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కేటాయించాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణు మాధవ్ మంగళవార ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖ దక్షిణ, విజయవాడ పశ్చిమ, మంగళగిరి నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో విశ్వబ్రాహ్మణులు ఉన్నారన్నారు.

ఈవీఎంలపై అవగాహన


ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ సురేష్ కుమార్, చిత్రంలో జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అపోహలు వీడాలని జోన్ – 8 కమిషనర్ మల్లయ్య నాయుడు సూచించారు. ఓటు వేసే విధానం అందరూ తెలుసుకోవాలన్నారు. ఈవీఎంల పనితీరుపై కొత్తపాలెం గోపాలపట్నంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలపై ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయని, అందుకే ఎన్నికల కమిషన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఓటు ఎలా వేయాలి, తాము వేసిన ఓటు తాను అనుకున్న వ్యక్తికి పడిందా లేదా అని సరి చూసుకోవచ్చని గోపాలపట్నం ఆర్ఐ సురేష్ కుమార్ వివరించారు.

వైభవంగా ధనుర్మాస పూజలు


గోదాదేవికి తిరువీధిలో హారతి అందజేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధినిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు ఏడో రోజు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీ అధిష్ఠింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు.

రే తాత్కాలిక షెడ్ల తొలగింపు షురూ


ఆరిలోవ కాలనీలో తొలగించిన రే తాత్కాలిక షెడ్లు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న రాజీవ్ ఆవాస్ యోజన(రే) తాత్కాలిక షెడ్ల తొలగింపు చర్యలను జీవీఎంసీ అధికారులు మంగళవారం ప్రారంభించారు. 12వ వార్డు సూర్యతేజానగర్ వాసులకు 'రే'పథకం వర్తించడంతో పక్కా భవనాలు నిర్మించాల్సి వచ్చింది. సుమారు ఆరేళ్ల క్రితం నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు జీవీఎంసీ ఇక్కడ గ్రామస్తులకు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసింది. వాటిని పార్వతీనగర్ గెడ్డ అంచున, ఆరిలోవ కాలనీలో శివాజీనగర్–2లో సుమారు 200 తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసింది. సూర్యతేజానగర్‌లో పక్కా భవనాలు నిర్మాణం జరగడంతో సుమారు రెండేళ్లగా ఇక్కడ తాత్కాలిక రే షెడ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడంతో స్థానికులు జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. దీంతో పార్వతీనగర్ గెడ్డ అంచున నాలుగు నెలలు క్రితం తాత్కాలిక రే షెడ్లను తొలగించారు. ఇప్పుడు రెండు రోజులుగా శివాజీనగర్–2లో ఉన్న షెడ్లను తొలగిస్తున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పార్వతీనగర్‌లో రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పార్వతీనగర్‌లో రోడ్లు, కాలువల నిర్మాణానికి మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పార్వతీనగర్‌లో రూ.20 లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనులు త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ఇప్పటికే రోడ్ల విస్తరణ, అందుబాటులో గెడ్డలపై వంతెనలు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, స్థానికులు సూరిబాబు, బాబ్జి, అప్పలరాజు, గోపి, సంపత్, మహిళలు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

యోగా కేంద్రంలో ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం, రోటరీ క్లబ్ సంయుక్తంగా మంగళవారం బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో ప్రత్యేక ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ ప్రారంభించారు. 160 మందికి పైగా ప్రజలు తమ సమస్యలకు చికిత్స పొందారు. యోగా కేంద్రం బోధన సిబ్బంది డాక్టర్ తులసీరావు, డాక్టర్ చిట్టూరి శ్రావణి శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య భానుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజారావుకు ఎన్విరాన్‌మెంటలిస్ట్ అవార్డు


రాజారావును అభినందిస్తున్న వీసీ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ విభాగంలో సహాయ ఆచార్యుడు(కాంట్రాక్ట్)గా పని చేస్తున్న డాక్టర్ జి.రాజారావుకు నేషనల్ ఎన్విరాన్‌మెంటలిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ 2023 సంవత్సరానికి రాజారావుకు ఈ అవార్డును బహూకరించింది. ఈ సందర్భంగా ఆయనను ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగంలో రాజేశ్వరికి ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం పరిశోధకురాలు ఆలేటి రాజేశ్వరికి వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఫార్మసీ కళాశాల విశ్రాంత ఆచార్యుడు కె.వి.రమణమూర్తి పర్యవేక్షణలో గుండె పోటును నియంత్రించే విధంగా ప్రత్యేకమైన ఔషధాన్ని రూపకల్పన చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులను మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరిని ఫార్మసీ కళాశాల ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే


28వ వార్డులో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు


బాలాజీనగర్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: గత సాధారణ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో నెరవేర్చారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆమె పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, వాటి వల్ల ప్రజలు ఎలాంటి లబ్ధి పొందుతున్నారో వివరించారు. దేశ చరిత్రలోనే ఎక్కడాలేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.మోహనరావు, మక్బుల్, సకీనా, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని అందరూ కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు తెలిపారు. జీవీఎంసీ 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మొల్లి అప్పారావు పాల్గొని పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి కోన కామేశ్వరరావు, సంపంగి సురేష్, బి.వెంకట్రావు, బొట్టు నాగరాజు, సచివాలయం సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో క్రిస్మస్ సంబరాలు


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఏయూ క్యాంపస్: ఏపీ ఈపీడీసీఎల్‌లో ఉద్యోగులు మంగళవారం క్రిస్మస్ వేడుకలను పవర్ ఎంప్లాయిస్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ ఇమ్మడి పాల్గొని కేక్ కట్ చేసి, ఉద్యోగులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఏసు అందించిన సందేశం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సీజీఎంలు వి.విజయలలిత, ఎస్.ఎం.మణి, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్ర ప్రసాద్, జీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ, చిత్రంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ అన్నారు. మంగళవారం రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, ప్రైవేటు ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీ, పురుష నిష్పత్తిలో చాలా తేడా ఉందన్నారు. లింగ నిర్ధారణ చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, చేసిన వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఫారం–ఎఫ్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశం ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ డి.కాంతారావు, ఐసీడీఎస్ పీవో జి.శ్రీలత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికురాలి ముసుగులో చోరీలు

అల్లిపురం: బస్సులు, ఆటోల్లో ప్రయాణం చేస్తూ తోటి ప్రయాణికుల నుంచి విలువైన వస్తువులు, నగదు దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెయిందొరపేటకు చెందిన పిల్లా సుభద్ర ఈ నెల 14న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లే నిమిత్తం గాంధీబొమ్మ సెంటర్‌లో ఆటో ఎక్కింది. మార్గం మధ్యలో మరో మహిళ ఆటో ఎక్కింది. ప్రయాణం సమయంలో సుభద్ర చేపలు కొనేందుకు ప్లాస్టిక్ కవర్‌తో పట్టుకున్న రూ.16వేలు కవర్‌ను కట్‌చేసి దొంగిలించింది. బాధితురాలు ఆటో దిగిన తరువాత చూసుకుంటే బ్యాగు కత్తిరించి ఉండటంతో ఆమె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ క్రైం పోలీసులు నిందితురాలు విజయనగరం జిల్లా, కొత్తవలసకు చెందిన గంటా మీనాగా గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు గంటా మీనాపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని తెలిపారు. ఈమె అమాయక మహిళలే టార్గెట్‌గా బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తూ దొంగతనాలకు పాల్పడుతుందని పోలీసులు పేర్కొన్నారు.

చోరీ సొత్తు రికవరీ

ఎంవీపీ కాలనీ: గత నెల 27వ తేదీ రాత్రి జరిగిన దొంగతనం కేసును ఎంవీపీ క్రైమ్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నవంబర్ 27న మద్దిలపాలెంలోని ఓ ప్లంబింగ్ షాపులో దొంగతనం జరిగింది. రూ.2 లక్షలు విలువ చేసే సామాన్లు చోరీకి గురైనట్లు షాపు నిర్వాహకుడు రాశి సాయికృష్ణ ఎంవీపీ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మోటూరి సతీష్(30)ని నిందితుడిగా గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి రూ.2 లక్షల చోరీ సొత్తును రికవరీ చేశారు.

పెన్షనర్ల హక్కుల కోసం పోరాటం


ప్రాంతీయ సమావేశం వివరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్: హార్బర్–పోర్టు పెన్షనర్ల హక్కుల సాధనకు సమైక్యంగా పోరాడుదామని హార్బర్–పోర్టు పెన్షనర్ల అసోసియేషన్ తీర్మానించింది. సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మినీ జనరల్ బాడీ సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముంబాయి, గోవాల్లో నిర్వహించిన పెన్షనర్ల సబ్ కమిటీ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈనెల 24న మాధవధార తోటలో వనసమారాధనతో పాటు సంఘం జనరల్ బాడీసమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి

కూర్మన్నపాలెం: స్వాతంత్య్రం అనంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమలతోనే దేశం అభివృద్ధి చెందిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సంస్థను ప్రైవేటీకరించాలనుకోవడం కార్మికులకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1041వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలని.. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సోగ్గాడు శోభన్‌బాబు పుస్తకావిష్కరణ

అల్లిపురం: దివంగత నటుడు శోభన్‌బాబు నటించిన సోగ్గాడు చిత్రం 1975 డిసెంబర్ 19న విడుదలై తెలుగు చిత్ర సీమలో రికార్డ్స్ తిరగరాసిందని శోభన్‌బాబు కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ ఆర్గనైజర్ గువ్వల వెంకటరమణ తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్ జంక్షన్‌లోని శోభన్‌బాబు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సోగ్గాడు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాత రామానాయుడు చిత్రాలలో సోగ్గాడు ప్రత్యేకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనకరాజు, కె.శోభన్‌బాబు, దన్నల ప్రసాద్, జి.నాగరాజు, బెహరా ప్రసన్న కుమార్, రమణ, ఎస్.రామారావు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనక మహాలక్ష్మి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. 108 స్వర్ణ పుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్త రోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2,300 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.